సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం। 27। జూన్। 2023



వెంటిలేటర్‌పై టీడీపీ
వెంటిలేటర్‌పై ఉన్న టీడీపీ.. ఎవరు ప్రాణవాయువు అందిస్తారా అని ఎదురు చూస్తున్న దుస్థితిలో ఉందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. - 8లో



వైఎస్‌ఆర్‌సీపీ నేత హత్య కేసులో ఆరుగురి అరెస్ట్
వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు చిన్ననాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి(42) హత్య కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



కుక్కల దాడిలో పొడదుప్పి మృతి
అట్లూరు మండలం ఎస్ వెంకటాపురం సమీపంలోని రహదారిపై అడవి నుంచి వచ్చిన పొడదుప్పి కుక్కల బారిన పడి సోమవారం మృతి చెందింది. - 8లో

న్యూస్‌రీల్

టైలరింగ్‌లో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకుగ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ కోఆర్డినేటర్ ఎస్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగ మహిళలు ఇందుకు అర్హులన్నారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈనెల 27 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 9440905478, 9985606866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'పద్మ' అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : యువజన సర్వీసుల శాఖ విజయవాడ ఉత్తర్వుల మేరకు గణతంత్ర దినోత్సవం–2024 సంవత్సరానికి పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీల కోసం సామాజిక సేవా రంగంలో అర్హులైన వారు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ పేర్కొన్నారు. తమ వివరాలను స్టెప్ కార్యాలయంలో పోస్టుద్వారాగానీ లేక నేరుగా గానీ సమర్పించాలన్నారు. హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మ అవార్డ్స్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలిచాలన్నారు. ఇతర వివరాలకు స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు (సెల్ నంబర్ 9949298810)ను సంప్రదించాలన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల కోసం..

కడప కోటిరెడ్డిసర్కిల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కడప మహిళా డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ ఎం.వీరభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ఆన్‌లైన్‌లో ఫీజు కట్టేందుకు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. విద్యార్థులు ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, ఓపెన్ ఇంటర్ రెండు సంవత్సరాలకోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు తమ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఏపీఎస్పీ 11వ బెటాలియన్ తనిఖీ

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌ను సోమవారం కర్నూల్ రేంజి ఏపీఎస్పీ బెటాలియన్ల-3 డీఐజీ సీహెచ్. వెంకటేశ్వర్లు బెటాలియన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐజీ ఆఫీస్, స్టోర్స్, యూనిట్ ఆసుపత్రి, ఆయుధాలను సందర్శించి తనిఖీ చేశారు. బెటాలియన్‌లోని పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కమాండెంట్ శ్రీనివాసరావు, అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు, వి. కేశవరెడ్డి, వెంకట్‌రెడ్డి, పి.ఎస్.డి. ప్రసాద్, వి. జయప్రసాద్ ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ సూపరింటెండెంట్ బదిలీ



వెంకటేశ్వరరావు

కడప అర్బన్ : కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈనెల 25న ఆయనను బదిలీ చేస్తూ రాష్ట్ర డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రమాదేవి..



రిమ్స్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.వి రమాదేవిని పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ప్రస్తుతం కడప రిమ్స్‌లో చిన్నపిల్లల విభాగం హెచ్ఓడీగా పనిచేస్తున్నారు. డాక్టర్ వెంకటేశ్వరరావు రిలీవ్ కాగానే రమాదేవి బాధ్యతలను స్వీకరిస్తారు. బుధవారం వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టనున్నారు.

యువ లాయర్లకు వరం

- 'వైఎస్సార్ లా నేస్తం'తో ఆర్థిక చేయూత
- కలెక్టర్ విజయరామరాజు
- జిల్లాలో 136 మందికి రూ. 6.80 లక్షలు మంజూరు



వీసీకి హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : కొత్తగా న్యాయవాద వృత్తిని చేపట్టిన యువ లాయర్లకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్సార్ లా నేస్తం'పథకం వరంగా మారిందని, ఆర్థిక చేయూత అందిస్తోందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకుని ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023–24 సంవత్సానికి సంబంధించి మొదటి విడతగా ఐదు నెలల (ఫిబ్రవరి–జూన్) లా నేస్తం నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. ఈ పథకం ద్వారా ఒక్కో యువ న్యాయవాది నెలకు రూ. 5 వేలు చొప్పున వైఎస్సార్ జిల్లాలో 136 మందికి రూ. 6,80,000 ఖాతాల్లో జమ అయింది. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ విజయరామరాజు, డీఆర్వో గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీసీ ముగిశాక కలెక్టర్ యువ న్యాయవాదులనుద్దేశించి మాట్లాడారు. 2019 అక్టోబరు నుంచి లా నేస్తం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. కొత్తగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన వారికి మూడు సంవత్సరాలపాటు వైఎస్సార్ లా నేస్తం కింద ఆర్థికసాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కొత్తగా వచ్చిన న్యాయవాదులకు ప్రాక్టీస్ ఉండదు గనుక వాళ్లు తమ కాళ్లపై నిలదొక్కుకునే వరకు మూడేళ్ల సంవత్సరానికి రూ. 60 వేలు ప్రభుత్వం ఇస్తోందన్నారు. ప్రభుత్వ సాయాన్ని పొందిన యువ న్యాయవాదులు పేద క్లయింట్లకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని కోరారు.

ఎంతో ఉపయుక్తం



మాది ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం. 2021లో శ్రీకాకుళం జిల్లాలో లా పూర్తి చేశా. సెప్టెంబరులో ఎన్‌రోల్ చేసుకుని కడప బార్‌లో ప్రాక్టీస్ ప్రారంభించా. 2022 నుంచి లా నేస్తం కింద నాకు ఆర్థికసాయం అందుతోంది. జూనియర్ లాయర్లకు ఆదాయం ఉండదు. చార్జీలు, ఇతర ఖర్చులకు లా నేస్తం కింద వచ్చే డబ్బులు ఉపయోగపడుతున్నాయి. ఈ పథకాన్ని సీఎం అమలు చేయడం ఎంతో సంతోషదాయకం.

– ఎం.సాదిక, జూనియర్ అడ్వకేట్, కడప

పెద్దన్నగా ఆదుకుంటున్నారు



యువ న్యాయవాదుల ఇబ్బందులు పరిగణలోకి తీసుకుని లా నేస్తం పథకం ద్వారా ఒక కుటుంబ పెద్దన్నగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని ఆదుకుంటున్నారు. కొత్తగా ప్రాక్టీస్ ప్రారంభించిన వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. లా నేస్తం వల్ల యువ న్యాయవాదుల ఇతర వృత్తుల వైపు వెళ్లకుండా కొనసాగే అవకాశం ఉంది. ఈ పథకాన్ని ఐదేళ్ల వరకు పొడిగిస్తే మరింత మేలు చేసిన వారవుతారు.

– కె.బాలగంగాధరరెడ్డి, యువ న్యాయవాది, కడప

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



నేను 2021లో లా పూర్తి చేసి ప్రొద్దుటూరులో జూనియర్ అడ్వకేట్‌గా పనిచేస్తున్నాను. వృత్తిలో స్థిరపడేందుకు లా నేస్తం ఎంతో ఉపయోగపడుతోంది. కొత్తగా వృత్తిలోకి అడుగు పెట్టినపుడు తక్కువ ఆదాయం వల్ల జూనియర్ లాయర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి ఈ విషయాన్ని గమనించి ఈ పథకాన్ని తీసుకు రావడం మాలాంటి వారికి ఎంతో మేలు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– ఆసియా ఫిర్దోస్, యువ న్యాయవాది, ప్రొద్దుటూరు

లా నేస్తం సాయాన్ని ఐదేళ్లకు పెంచాలి



నేను లా పూర్తి చేసి ఈ సంవత్సరం మార్చిలో ఎన్‌రోల్ చేసుకున్నాను. ప్రాక్టీస్ ప్రారంభించాను. ఆలిండియా బార్ ఎగ్జామ్ పాస్ అయినంత వరకు జూనియర్ లాయర్లు సొంతంగా కేసులు చేయడానికి అవకాశం లేదు. కనుక మా ఆర్థిక ఇబ్బందులు గమనించి రాష్ట్ర ప్రభుత్వం లా నేస్తం కింద సాయం చేయడం అభినందనీయం. కేరళ ప్రభుత్వం రూ. 3 వేలు ఇస్తుండగా ఇక్కడ రూ. 5 వేలు ఇవ్వడం సంతోషదాయకం. ఈ పథకాన్ని ఐదేళ్లకు పెంచాలి.

– టి.కిశోర్, యువ న్యాయవాది, జమ్మలమడుగు

ఔషధ నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ

అనారోగ్యానికి గురైన మనిషి ఆరోగ్య సంరక్షణకు ఔషధాలు (మందులు) ఎంతగానో దోహదపడుతాయి. మెరుగైన జీవనానికి సహకరించడంతో పాటు జీవన కాలాన్ని పెంపొందిస్తాయి. కీలకమైన ఈ విభాగాన్ని ప్రభుత్వం బలోపేతం చేసింది. ఔషధాల నాణ్యత పర్యవేక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగకిరణ్‌కుమార్ తెలిపారు.ఆయనతో జరిపిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. – కడప రూరల్

- 'ఎఫ్‌డీసీ'కి చెందిన 14 రకాల మందుల బ్యాన్
- సొంత వైద్యం అనారోగ్యానికి దారి తీస్తుంది
- జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఏడీ నాగకిరణ్‌కుమార్



? ఇటీవల కాలంలో ఏవైనా మందులను బ్యాన్ చేసిన సంఘటనలు ఉన్నాయా

హానికర ప్రభావం చూపిస్తాయనే కారణంతో ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ)కు చెందిన 14 రకాల మందులను ప్రభుత్వం ఈ నెల 2వ తేదీన బ్యాన్ చేసింది. ఈ మందులు ఊపిరితిత్తులు, జలుబు తదితర వ్యాధులకు సంబంధించినవి. ఇవి మూడు, నాలుగు రకాల సమ్మేళనంతో కూడిన మందులు.. వాటిల్లో యాస్కోరిల్–సీ, గ్రిల్‌లింటస్–సీడీ, కాఫ్రెస్ట్, కోఫక్యూ–ఎస్ఎఫ్ తదితర మందులు ఉన్నాయి. ఇందులో మాత్రలతో పాటు టానిక్‌లు ఉన్నాయి. ఈ మందులు ఏ షాపుల్లోనూ లేవు. ఒకవేళ ఎవరి దగ్గరైనా ఉంటే తిరిగి ఇచ్చేయాలి.

? మందుల నాణ్యతను ఎలా పరిశీలిస్తారు

డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు మార్కెట్‌లోకి వచ్చే మందులను శ్యాంపిల్‌గా తీసుకొని పరిశీలిస్తుంటారు. ల్యాబొరేటరీల్లో నిర్వహించే పరీక్షల్లో 95 నుంచి 105 శాతం ఉంటే అది నాణ్యతతో కూడుకున్నదని అర్థం. ప్రతి మందుకు వివిధ రకాలుగా నిర్వహించే పరీక్షల ద్వారా నాణ్యతను పరీక్షిస్తారు.ఏవైనా తేడాలు ఉంటే ఆయా కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయి.

? మందుల వాడకంపై మీరిచ్చే సూచనలు

వైద్యుడి సూచనలతోనే మందులు వాడాలి. అప్పుడే రోగి ఆరోగ్యం కుదుటపడుతుంది. సొంత వైద్యం అనర్థాలకు దారి తీస్తుంది. డాక్టర్ పర్యవేక్షణలోనే యాంటిబయాటిక్, పెయిన్ కిల్లర్ మందులను వాడాలి. లేదంటే మనిషి ఆరోగ్యంపై తీవ్ర పరిణామాలను చూపిస్తుంది. తద్వారా జీవన ప్రమాణం తగ్గిపోతుంది.

? మెడికల్ షాపుల నిర్వహణ ఎలా ఉండాలి

జిల్లా వ్యాప్తంగా 1,300 వందలకు పైగా మెడికల్ షాపులు ఉన్నాయి. మెడికల్ షాపులో ఫార్మసీ డిప్లమా చేసిన వారు ఉండాలి. అలాగే డాక్టర్ ఇచ్చిన ప్రిస్కిప్షన్ ఉంటేనే మందులు ఇవ్వాలి. వినియోగదారుడు తప్పని సరిగా మందుల కొలుగోలుకు సంబంధించిన బిల్లును తీసుకోవాలి. దీనివల్ల తీసుకున్న మందులో ఏవైనా సమస్యలు ఉంటే బిల్లులో ఉన్న వివరాల ఆధారంగా చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. అలాగే సమస్యలు ఉంటే సెల్ నంబరు 8632330909 కు ఫిర్యాదు చేయవచ్చు.

28లోగా దరఖాస్తు చేసుకోండి

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్‌జిల్లాలో ప్రధానమంత్రి– సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద ఆహార పదార్థాల సూక్ష్మ తరహా పరిశ్రమల స్థాపనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా ఉద్యాన అధికారి ఐజీ మైఖేల్‌రాజీవ్ తెలిపారు. ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం గరిష్టంగా పది లక్షల వరకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఖాజీపేట, చాపాడు, ఎర్రగుంట్ల, బద్వేల్, ముద్దనూరు, సింహాద్రిపురం, మైదుకూరు, కాశినాయన మండలాల పరిధిలోని మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా ఉద్యాన అధికారి కార్యాలయం ఓ బ్లాక్ కొత్త కలెక్టరేట్ కడప సెల్ నంబర్ 7995086989 సంప్రదించాలని మైఖేల్‌రాజీవ్ తెలిపారు.

నేటి నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుద్దీపాలంకరణలతో నందలూరు సౌమ్యనాథాలయం



ముత్యాల తలంబ్రాలను తీసుకొస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

4న కల్యాణం, 5న రథోత్సవం

నందలూరు(రాజంపేట) : అన్నమయ్య జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. టీటీడీలో విలీనం తర్వాత తొలిసారిగా బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు సర్వంసిద్ధం చేశారు.ఈ నెల 27 నుంచి 7 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. తొలిరోజు సాయంత్రం అంకుర్పారణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

కార్యక్రమాలిలా..

28న ధ్వజారోహణం, 2న గరుడసేవ, 4న కల్యాణోత్సవం, 6న చక్రసానం. 07న పుష్పయాగం కార్యక్రమాలను టీటీడీ నిర్వహిస్తుంది. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించి పాల్గొనాలని టీటీడీ కోరింది.

వాహనసేవలిలా..

28న యాళివాహనం, 29న హంసవాహనం, 30న సింహవాహనం, 01న హనుమద్వాహనము, 2న గరుడవాహనం, 3న చంద్రప్రభవాహనం, 4న గజ వాహనం, 5న అశ్వవాహనాలపై సౌమ్యనాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు సాయంత్రం ఊంజల్‌సేవ(డోలోత్సవం), ఉదయం స్నపన తిరుమంజనం కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ముత్యాల తలంబ్రాలు అందజేత

వచ్చేనెల 4న నందలూరు సౌమ్యనాథాలయంలో జరిగే స్వామివారి కల్యాణానికి తమ స్వంతనిధులతో ముత్యాలతలంబ్రాలును తిరుమల తిరుపతిదేవస్థానానికి మండలాధ్యక్షుడు మేడావిజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడాపద్మజ దంపతులు అందజేశారు. సోమవారం ఆలయానికి చేరుకున్న వీరికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సంప్రదాయపద్ధతిలో ముత్యాల తలంబ్రాలను టీటీడీ టెంపుల్స్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లయ్యకు అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెలనాని, సోమిశెట్టి ప్రభాకర్, నడివీధిసుధాకర్, పెనుబాలనాగసుబ్బయ్య, తుమ్మలశ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్న పథకాలతో పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపుతున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న ప్రమాణ స్వీకారం చేపట్టిన రోజు నుంచి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని పూర్తి చేయడమేకాక, ఇవ్వని పథకాలను ప్రజలకు అందించారని చెప్పారు. అనంతరం ఆయన ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రజా దర్బార్ నిర్వహించారు.

వేగం.. పారదర్శకం

- అందుబాటులోకి ఈ–స్టాంపులు
- స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు మరింత సులువు



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రిజిస్ట్రేషన్లకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు.రిజిస్ట్రేషన్ లావాదేవీల్లో, దస్తావేజు తయారీలో నాన్ జ్యుడిషియల్ స్టాంపుల కొనుగోలులో పారదర్శకతను పెంచారు. ఇప్పుడు నాన్ జ్యుడిషియల్ స్టాంపులతో సమాన విలువైన ఈ–స్టాంపులు అందుబాటులోకి వచ్చాయి.అపోహలు పక్కన పెట్టి ఈ–స్టాంపింగ్ వాడుకోవాలని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఓ ప్రత్యేక బృందం తనిఖీ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పారదర్శకంగా, జవాబుదారీతనంతో, వేగవంతంగా ప్రజలకు సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఆన్‌లైన్ సర్వీసులను ప్రారంభించింది. అందులో భాగంగా రికార్డులు, డిజిటలైజేషన్, ఈసీ, సీసీలు, ఫర్మ్‌లు, సొసైటీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసలుబాటును అందుబాటులోకి తీసుకొచ్చింది. నాటి మ్యానువల్ పద్ధతులు కాకుండా కార్డు సీసీపీ నుంచి కార్డు 20 వరకు కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకుంటూ అన్ని సేవలను సామాన్యులు సైతం సరళంగా అర్థం చేసుకునేలా రూపకల్పన చేశారు. అఫిడవిట్లు, బ్యాంకురుణాలు, తనఖాలువంటి వాటితోపాటు రిజిస్టర్ సేవలైన కొనుగోలు, బహుమానాలు, ఫ్యామిలీ సెటిల్‌మెంట్లు, పంపకాల వంటి వ్యవహారాలకు స్టాంప్ పేపర్స్ (నాన్ జ్యుడిషియల్) తప్పనిసరి. ఈ క్రమంలోనే ఈ–స్టాంప్ విధానానికి రిజిస్ట్రేషన్‌శాఖ శ్రీకారంచుట్టింది.

- ప్రజలకు సులువుగా సేవలు అందుతాయి
- కామన్ సర్వీసు సెంటర్(సీఎస్‌సీ), అలాగే ఎంపికచేసిన బ్యాంకుల్లో ఈ–స్టాంప్స్ లభిస్తాయి.
- రోజువారీ జరిగే అన్నిరకాల రిజిస్ట్రేషన్లు, నాన్ రిజిస్ట్రేషన్లు కార్యకలాపాలకు ఈ–స్టాంపులను ఉపయోగించవచ్చు.
- జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఈ–స్టాంప్ కౌంటర్ల ద్వారా అన్ని రకాల పేమెంట్లు చెల్లించే సౌకర్యం కల్పించారు.
- ఆర్ఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా జిల్లాల వారీగా సీఎస్‌సీ, ఏసీసీ ద్వారా వివరాలను పొందవచ్చు.
- లైసెన్స్ పొందిన స్టాంప్ వెండర్లు, సీఎస్‌సీ సెంటర్లు, బ్యాంకుల వద్ద, ఇతర ఆర్థిక వ్యవహారాలు నిర్వహించే సంస్థల వద్ద ఈ–స్టాంప్స్ లభిస్తాయి.
- ప్రస్తుతమున్న నాన్‌జ్యుడిషియల్ స్టాంప్ పేపరుకు సమానమైన విలువ కలిగిన సమాంతరమైన సేవలు ఈ–స్టాంపింగ్‌తో లభిస్తాయి.

ఈ–స్టాంపులను సద్వినియోగం చేసుకోవాలి



రిజిస్ట్రేషన్‌శాఖలో మరింత పారదర్శకత పెంచేందుకు అనేక నూతన విధానాలను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. నాన్ జ్యుడిషియల్ స్టాంపులతో సమాన విలువైన ఈ–స్టాంపులను అందుబాటులోకి తీసుకొచ్చాం. దీనిపై ఎటువంటి అపోహలు పడొద్దు. ప్రతి ఒక్కరూ ఈ–స్టాపింగ్‌పై అవగాహన పెంచుకుని సులువుగా లావాదేవీలు నిర్వహించుకునేందుకు చొరవ చూపాలి. – పీవీఎస్ బాబు, జిల్లా రిజిస్ట్రార్, కడప

అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక స్పందన కార్యక్రమంలో అందిన అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిశీలించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుదారుల నుంచి అందే విజ్ఞప్తులను అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ వంటివి లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్‌నాయక్, శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచాలి

జగనన్న గృహ నిర్మాణ పనుల్లో పురోగతి పెంచాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన క్షేత్ర స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది అత్యంత ప్రాధాన్యత అంశంగా భావిస్తోందన్నారు. అందుకే పనులను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్యాలు సాధించడం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందించాలన్నారు. విద్యుత్, నీటి సరఫరాకు వెంటనే ఏర్పాట్లు చేయాలన్నారు. గృహ నిర్మాణశాఖ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రతిరోజు సమీక్షించాలని సూచించారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, మున్సిపల్ కమిషర్ ప్రవీణ్‌చంద్; డీఆర్వో గంగాధర్‌గౌడ్, హౌసింగ్‌పీడీ కృష్ణయ్య. ఆర్డీఓలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ సమస్యలపై వినతి

కేంద్రీయ విద్యాలయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు విన్నవించారు. ఆర్టీసీ బస్సులు పూర్తి స్థాయిలో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బస్ పాసుల జారీలో జాప్యాన్ని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ యూనియన్ నాయకులు జితేంద్ర, శివరామ్, గీత, హిరణ్మయి, లక్ష్మీకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ నేత హత్య కేసులో ఆరుగురి అరెస్ట్

- మారణాయుధాలు, సెల్‌ఫోన్‌లు, బురఖా స్వాధీనం
- కీలక ఆధారాల ద్వారా మరికొందరికి నోటీసులు జారీ చేస్తాం
- బాధ్యులెవరైనా వుంటే చర్యలు తీసుకుంటాం
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : వైఎస్ఆర్‌సీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిన్ననాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి(42) హత్య కేసులో ఆరుగురిని అరెస్ట్ చేశారు. శ్రీనివాసులరెడ్డిని ఈ నెల 23న ఉదయం 8:10 గంటల సమయంలో కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంధ్యా సర్కిల్ సమీపంలో దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో ప్రధాన నిందితుడు మోపూరు ప్రతాప్‌రెడ్డితోపాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిందితులను తీసుకుని వచ్చి హాజరు పరిచారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విలేకరులకు వివరాలు తెలియజేశారు. అరెస్టయిన వారిలో పెండ్లిమర్రి మండలం కొండూరుకు చెందిన ప్రధాన నిందితుడు మోపూరు ప్రతాప్‌రెడ్డి ప్రస్తుతం కడపలో జిల్లా కోర్టు కాంప్లెక్స్ వెనుకభాగాన ఓ ఇంటిలో నివాసం వుంటున్నాడు. రెండవ నిందితుడు కడప పాలెంపల్లికి చెందిన మేరువ శ్రీనివాసులు ప్రస్తుతం సాయిపేటలో నివాసం వుంటున్నాడు. మూడవ నిందితుడు కడప నగరంలోని పాతకడపకు చెందిన కల్లూరు సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్, కడప నగర శివార్లలోని పుచ్చలపల్లి సుందరయ్యకాలనీకి చెందిన బరకం హరిబాబు, కడప నగరంలోని శంకరాపురంలో నివాసముంటూ వార్డు వలంటీర్‌గా వున్న కోనేరు వెంకటసుబ్బయ్య, కడప నగరం పాతకడపకు చెందిన పత్తూరు భాగ్యరాణి వున్నారు. గతంలో శ్రీనివాసులరెడ్డితో కలిసి ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు కడప చుట్టుపక్కలా, ఇతర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ఈ విషయంలో వారికి విభేదాలు తలెత్తాయి. ప్రతాప్‌రెడ్డితోపాటు మరో నిందితుడు మేరువ శ్రీనివాసులుకు శ్రీనివాసులరెడ్డి తీవ్రంగా ఆర్థిక నష్టం కలిగించాడని భావించారు. అంతేగాక కిరాయి హంతకులతో తనను అంతమొందించడానికి ప్రయతిస్తున్నాడని ప్రతాప్‌రెడ్డి భావించాడు. శ్రీనివాసుల రెడ్డి తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అడుగడుగునా అడ్డు తగులుతున్నాడని ప్రతాప్‌రెడ్డి భావించాడు. దీంతో శ్రీనివాసులరెడ్డిని హత్య చేసేందుకు తనతో పాటు వున్న మేరువ శ్రీనివాసులు, నిందితురాలు భాగ్యరాణి పరిచయం చేసిన మిగిలిన నిందితులతో కలిసి ప్రతాప్‌రెడ్డి పథకం పన్నాడు. కల్లూరు సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్, బరకం హరిబాబు, వెంకటసుబ్బయ్యతో పరిచయం చేసుకుని హత్యకు కుట్ర పన్నారు. ఈ పథకంలో భాగంగానే ఈనెల 23న ఉదయం మోపూరు ప్రతాప్‌రెడ్డి, సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్ బురఖాలు ధరించారు. తమతోపాటు మారణాయుధాలైన బాకు, కత్తిని, కొడవలిని తీసుకున్నారు. శ్రీనివాసులరెడ్డి కదలికలను గమనించారు. శ్రీనివాసులరెడ్డి రాబిట్ ఫిట్‌నెస్‌కు వెళ్లినప్పటి నుంచి బయటకు వచ్చేంత వరకు కాపుకాశారు. అతను రాగానే మృతుడి రాయల్‌ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌కు కోనేరు వెంకటసుబ్బయ్య తన మోటార్ సైకిల్‌ను అడ్డు పెట్టాడు. అప్పటికే బురఖాలు ధరించి కత్తులు చేతపట్టిన ప్రతాప్‌రెడ్డి, సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్ ఒక్కసారిగా శ్రీనివాసులరెడ్డిపై దాడి చేశారు. ఈ దాడిలో శ్రీనివాసులరెడ్డి ఛాతీకి, గుండెకు బలమైన గాయాలు కావడంతో కొంతదూరం వెళ్లి కుప్పకూలిపోయాడు. హత్య జరిగిన తరువాత మేరువ శ్రీనివాసులు అక్కడే వుండి గమనించసాగాడు. హరిబాబుతో ఫోన్‌లో మాట్లాడుతూ అతని మోటార్‌సైకిల్‌పై ప్రతాప్‌రెడ్డి, ఫ్రాన్సిస్ ఊరిబయటికి వెళ్లిపోయారని ఎస్పీ తెలిపారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని, బురఖాను అక్కడే వదిలేసి వెళ్లారన్నారు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులకు ఫ్రాన్సిస్‌ను పరిచయం చేయడంలో కీలకంగా వ్యవహరించిన పాత కడపకు చెందిన భాగ్యరాణిని 109 (హత్యకు ప్రేరేపించడం) నేరం కింద అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఇంకా కొంతమందిపై అనుమానాలున్నాయని, వారికి నోటీసులు ఇచ్చామని, మరికొంతమందిపై వారి నుంచి సమాధానాలు రావాలని ఎస్పీ పేర్కొన్నారు. కాల్ డీటైయిల్స్ ఆధారాలు, వాట్సాప్ చాట్‌లు, గూగుల్ టేక్ అవుట్ తదితర సాంకేతిక అంశాల ద్వారా వివరాలు రాబడుతున్నామనీ, ఎవరిపై అనుమానాలు వచ్చి నిరూపణ అయితే వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. ఈ సంఘటన చాలా దురదృష్టకరమైనదనీ ఎస్పీ అన్నారు.

ఆ మహిళ.. అందరికీ స్ఫూర్తిదాయకం

హత్య జరిగే సమయంలో ఓ మహిళ ధైర్యంగా కత్తిని అక్కడి నుంచి తీసిందని, సదరు మహిళను సన్మానిస్తామని ఎస్పీ తెలిపారు. పబ్లిక్‌లో ఇలాంటి సంఘటనలు జరిగేటపుడు పౌరులు తమవంతు బాధ్యతగా ప్రతిఘటించాలని కోరారు. కేసును తాము తేలిగ్గా తీసుకోవడం లేదని, ఇంకా కొన్ని అనుమానాలు వున్నాయని, అలాంటి వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. హత్యలో ఎలాంటి రాజకీయం లేదని, హత్య కేవలం ప్రాపర్టీ, డబ్బుల కోసమే జరిగిందన్నారు. ఈ సంఘటనలో అవాస్తవాలు ఎక్కువ ప్రచారం జరుగుతున్నాయని, అలాంటి వాటిపైన కూడా దృష్టి సారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూకబ్జాకు కేసుకు సంబంధం లేదని, ఒకవేళ భూకబ్జాకు సంబంధించి వుంటే బాధితులు పోలీసులను ఆశ్రయిస్తారని, అలాంటిదేమీ లేదన్నారు.


స్వాధీనం చేసుకున్న బురఖా, సెల్‌ఫోన్‌లు, మారణాయుధాలు, మోటార్ సైకిళ్లు

■ ఈ హత్య కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో కీలకపాత్ర పోషించిన కడప ఒన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు, కడప రూరల్ సీఐ కె.అశోక్‌రెడ్డి, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, సిద్ధయ్య, సైబర్‌క్రైమ్ ఎస్ఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి, ఏఎస్ఐ మల్లయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎన్.వేణుగోపాల్, కానిస్టేబుళ్లు ఖాదర్‌హుసేన్, చంద్ర, నారాయణరెడ్డి, కిరణ్, బాషలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అప్పు చేసి పరారైన రిటైర్డ్ హెడ్మాస్టర్

కలసపాడు : కలసపాడుకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కామిశెట్టి ప్రభాకర్‌రావు అప్పులు చేసి పరారయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కలసపాడుకు చెందిన రిటైర్డ్ హెడ్మాస్టర్ ప్రభాకర్‌రావు కలసపాడుతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల వద్ద రూ.4 కోట్ల మేర అప్పులు చేసి చేతులెత్తేసి గత నాలుగు నెలల క్రితం కలసపాడు నుంచి పారిపోయి నంద్యాలకు మకాం మార్చాడు. దీంతో సోమవారం బాధితులు కడప కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు వినతి పత్రాలు అందజేశారు. ప్రభాకర్‌రావు ఆస్తులను జప్తుచేసి తమ డబ్బులను ఇప్పించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

చక్రాయపేట : మండలంలోని నెరుసుపల్లె గ్రామ సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌పై సోమవారం ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని ఎస్ఐ వినోద్ తెలిపారు. పంట నమోదు విషయంలో సాయికుమార్, నాగేంద్ర అనే వ్యక్తులు ప్రవీణ్ కుమార్‌తో గొడవ పడి చివరకు దాడి చేశారని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

30న మోటారు సైకిళ్ల వేలం

కడప అర్బన్: చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నంబర్ 114/ 2023 సెక్షన్ 102 సీఆర్‌పీసీ కింద జప్తు చేసిన 27 మోటారు సైకిళ్లకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 30న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని సీఐ శ్రీరామ్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నలుగురు గంజాయి విక్రయదారులపై పీడీ యాక్ట్

రాయచోటి : యువతను మత్తులో ముంచి జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి విక్రయదారులపై పోలీసులు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ గంగాధర్‌రావు వివరాలు వెల్లడించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను పూర్తి స్థాయిలో అరికట్టి గంజాయి రహిత జిల్లాగా మార్చాలన్నదే పోలీసుల ధ్యేయమన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయిస్తూ యువతను పెడదారి పట్టిస్తున్న వారిని గుర్తించామన్నారు. వారిపై పలుమార్లు కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోవడంతో నలుగురిపై పీడీయాక్టు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రాయచోటికి చెందిన కత్తి వినయ్‌కుమార్ (22), షేక్ దిల్షాద్ (45), కురబలకోట మండలం అంగళ్లకు చెందిన నూర్ మహ్మద్ (60), రాజంపేట మండలం బోయనపల్లికి చెందిన తొండేటి శేఖర్‌బాబు (40)పై పీడీ యాక్టు ప్రయోగించామని పేర్కొన్నారు. గంజాయి కారణంగా కళాశాలలు, పాఠశాలల్లో యువత మత్తుకు బానిస కాకుండా ఉండేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు వాడకం వలన కలిగే నష్టాల గురించి హోర్డింగ్‌లు, కరపత్రాల ద్వారా చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. విక్రయదారుల సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబరు 14500 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐలు సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకొందాం

రేపటి నుంచి ప్రారంభమయ్యే బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు సూచించారు. పండుగను దృష్టిలో ఉంచుకొని కొంత మంది ఆకతాయిలు సోషల్ మీడియా ఆధారంగా చేసే దుష్ప్రచారాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. తప్పుడు ప్రచారాలను చేసే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. సోదర భావంతో శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని, అందరూ కలిసిమెలసి జీవనం సాగించేలా జిల్లా ప్రజలు సహకరించాలని ఎస్పీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

వెంటిలేటర్‌పై టీడీపీ

దువ్వూరు : వెంటిలేటర్‌పై ఉన్న టీడీపీ.. ఎవరు ప్రాణవాయువు అందిస్తారా అని ఎదురు చూస్తున్న దుస్థితిలో ఉందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం దువ్వూరు లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. 175 స్థానాల్లో సొంతంగా పోటీ చేసే దమ్ము టీడీపీకి లేదన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేని దుస్థితిలో ఉన్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ తోక పార్టీలు ఎన్ని కలసి వచ్చినా 2024 ఎన్నికల్లో ప్రజల దీవెనలతో వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ ఒక రాజకీయ అజ్ఞాని అని, ఆయనకు ఒక సిద్ధాంతం అంటూ లేదని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ సభలలో వైఎస్సార్‌సీపీ నాయకులకు చెప్పు చూపించడం ఆయనకు ఉన్న సంస్కృతి ఏపాటిదో ప్రజలందరూ గ్రహించారని, ఇకనైనా అలాంటివి మానుకోవాలని హితవు పలికారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనసుతో ఆశీర్వదించి మరో 20 ఏళ్లపాటు సీఎంగా గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సర్పంచ్ దండు చెంద్రాయుడు, ఎంపీటీసీ జేష్టాది రఘు, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల ఓబుళరెడ్డి, సచివాలయ కన్వీనర్ శంకర్‌రెడ్డి, ఆశీర్వాదం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, అమీర్, గౌస్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దంపతుల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి పట్టణంలో జరిగింది. ఇందిరానగర్‌కు చెందిన సయ్యద్‌పీర్ కుమారుడు సయ్యద్ మహబూబ్‌బాషా(38) బియ్యం వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. భార్య యాస్మిన్(33)తో గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో విభేదాలు నడుస్తున్నాయి. ఈ విషయంగా తరచూ గొడవ పడుతున్నారు. ఆదివారం రాత్రి మరోసారి దంపతుల మధ్య గొడవ జరిగి తారాస్థాయికి చేరడంతో యాస్మిన్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వెంటనే భర్త సయ్యద్ మహబూబ్‌బాషా సైతం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్సలు చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు రెఫర్ చేశారు.

కుక్కల దాడిలో పొడదుప్పి మృతి

అట్లూరు : అడవి నుంచి వచ్చిన పొడదుప్పి కుక్కల బారిన పడి సోమవారం మృతి చెందింది. ఎస్.వెంకటాపురం సమీపాన కడప-బద్వేలు ప్రధాన రహదారి పక్కన పొడదుప్పి వెంట కుక్కలు పడి దాడి చేస్తుండగా.. స్థానికులు కాపాడి సిద్దవటం సెక్షన్ ఆఫీసర్ సురేష్‌కు సమాచారం అందించారు. అటవీ అధికారులు వచ్చే లోపే మృతి చెందింది. మృతి చెందిన పొడదుప్పిని బీట్ ఆఫీసర్‌లు విశ్వనాథ రెడ్డి, నారాయణరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్ రమణ అట్లూరు పశువైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మద్దూరు బీట్ అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ సురేష్ తెలిపారు.


పొడదుప్పికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న దృశ్యం

లారీ డ్రైవర్ మృతి

చెన్నూరు : తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ పాండ్యన్ (43) ఆదివారం ఉదయం పాత టోల్‌గేట్ వద్ద మృతి చెందినట్లు సోమవారం సాయంత్రం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన డ్రైవర్ పాండ్యన్ బనగానపల్లెలో ట్యాంకర్ లారీలో సిమెంట్ లోడ్ చేసుకొని చెన్నై వెళుతుండగా.. చెన్నూరు పాత టోల్‌గేట్ వద్దకు రాగానే పక్కన నిలబెట్టి కిందికి దిగాడు. బ్రష్‌తో దంతాలు తోముకుంటూ కింద పడిపోయాడు. వేరే లారీ డ్రైవర్ గమనించి అతన్ని పైకి లేపి కడప రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా పాండ్యన్‌కు బనగానపల్లెలో ఉన్నప్పుడే ఫిట్స్ వచ్చాయని, అయితే కోలుకొని మళ్లీ డ్రైవింగ్ చేసుకుంటూ ఇక్కడికి రావడం, కింద పడిపోయి మృతి చెందడం జరిగిందని తోటి లారీ డ్రైవర్లు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. పాండ్యన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.


పాండ్యన్ మృతదేహం

రోడ్డు ప్రమాదాల్లో 8 మందికి గాయాలు

రామాపురం : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 8 మందికి గాయాలయ్యాయి. కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధి బండపల్లి పంచాయితీ పొత్తుకూరుపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్య, భర్తలు గాయపడ్డారు. వీరబల్లి మండలం మాదిరెడ్డిగారిపల్లెకు చెందిన రెడ్డయ్య, శాంతమ్మ రామాపురం మండలంలోని కుమ్మరపల్లె పంచాయితీ మన్నేరువాండ్లపల్లె గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. వారిని 108లో రాయచోటి ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా

కర్నూలు – చిత్తూరు రహదారిలోని మండల పరిధి నీలకంఠ్రావుపేట పంచాయితీ దివిజ్ఞాన మందిరం సమీపంలో సోమవారం కారు బోల్తా పడడంతో నలుగురు గాయపడ్డారు. రాయచోటి టౌన్‌కు చెందిన విశ్వనాథ రాజంపేటలోని ఓ కాలేజీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన భార్య నాగమణి, కుమారులు కార్తీక్, నరసింహులుతో కలిసి కారులో విజయవాడ నుంచి రాయచోటి వస్తుండగా మార్గంమధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వారు నలుగురు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

గాలివీడు : మండల పరిధి కరిమిరెడ్డిగారిపల్లె వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గోపనపల్లె గ్రామం పూజారివాండ్లపల్లెకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి, ప్రమీళమ్మ బైక్‌పై వెళ్తుండగా.. వెనుకన కూర్చున్న ప్రమీళమ్మ చీర టైరుకు చుట్టుకోవడంతో అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమీళమ్మకు రాయచోటిలో చికిత్స అందిస్తుండగా, నాగేశ్వర్‌రెడ్డిని కడపకు తరలించారు.